
# సాక్షి పల్నాడు

బుధవారం । 23 । అక్టోబర్ । 2024




## 3న గ్యార్మీ, గంధ మహోత్సవం

భట్టిప్రోలు: హజరత్ మహబూబ్ సుభానీ 13వ గ్యార్మీ, గంధ మహోత్సవం నవంబర్ 3న భట్టిప్రోలు మండలం వేమవరంలో జరుగుతుందని మహబూబ్ సుభానీ మంగళవారం తెలిపారు.



## పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 21,490 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. దిగువకు 16,000 క్యూసెక్కులు వదులుతున్నారు.



## డివైడర్ ఎక్కిన బస్సు

నాదెండ్ల: అద్దంకి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు విజయవాడ నుంచి చిలకలూరిపేట వైపు వెళుతూ గణపవరం వద్దకు రాగానే బ్రేక్ ఫెయిల్ కావటంతో డివైడర్ ఎక్కింది.




# ఎగిరిపోయేలా..!

డ్రోన్... ఒకప్పుడు ఫొటోలు, వీడియో తీయడానికి వినియోగించిన వీటిని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందు చూపుతో సాగు రంగంలోకి తెచ్చారు. పరిశోధనల దిశగా ఆయన నిర్దేశం చేశారు. ఎరువులు, పురుగు మందులు చల్లడానికి, వెద సాగుకు డ్రోన్ ఉపయోగించేలా చొరవ తీసుకున్నారు. ఆచార్య రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నాటి ప్రభుత్వ సహకారంతో ఎన్నో నూతన అంశాలకు శ్రీకారం చుట్టింది. డీజీసీఐ అనుమతితో 950 మంది డ్రోన్ పైలట్లుగా శిక్షణ పూర్తి చేసుకున్నారు.

- సాగు రంగంలో 'డ్రోన్ల'కు పెద్దపీట
- వైఎస్సార్ సీపీ హయాంలోనే అడుగులు
- నాటి సీఎం వైఎస్ జగన్ ముందుచూపు
- ఇప్పటికే 950 మందికి డ్రోన్ పైలెట్లుగా శిక్షణ

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రాష్ట్రంలో డ్రోన్‌లను ఉపయోగించడానికి, వాటిపై విశేష పరిశోధనలు జరగడానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దోహదం చేసింది. డ్రోన్ టెక్నాలజీని వ్యవసాయ రంగంతోపాటు సైనిక అవసరాలు, ఫుడ్ డెలివరీకి కూడా ఉపయోగిస్తున్నారు. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీసర్వేకి కూడా డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించి మంచి ఫలితాలు సాధించిన సంగతి తెలిసిందే. పెరిగిన ఖర్చులతో నష్టపోతున్న రైతన్నకు ఊరట కల్పించడమే కాకుండా యువతరాన్ని ఈ రంగం వైపు మళ్లించడానికి ఈ డ్రోన్ టెక్నాలజీని గత ప్రభుత్వం అభివృద్ధి చేసింది. వ్యవసాయ రంగంలో వినియోగించడంతోపాటు డ్రోన్ పైలెట్లను తయారు చేసే బాధ్యతను ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అప్పగించింది. 2018లోనే డ్రోన్ టెక్నాలజీ అభివృద్ధికి యూనివర్సిటీ శ్రీకారం చుట్టినా, 2019 వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అందించిన ప్రోత్సాహంతో గణనీయంగా దీనిని అభివృద్ధి చేసింది. డ్రోన్ టెక్నాలజీని ఎరువులు, పురుగు మందులు జల్లడానికి, విత్తనాలు వెద పద్ధతిలో జల్లడానికి ఉపయోగిస్తున్నారు. ఆధునిక పద్ధతులను జోడించడం ద్వారా వెద పద్ధతిని, సస్యరక్షణలో మందుల వినియోగానికి డ్రోన్ టెక్నాలజీ ఉపయోగిస్తున్నారు.

### 950 మందికి శిక్షణ పూర్తి

దేశంలోనే ఎక్కడా లేని విధంగా డ్రోన్‌లను వినియోగించడంతోపాటు పైలెట్లను ఆచార్య ఎన్‌జీ రంగా యూనివర్సిటీ శిక్షణ ఇస్తోంది. ఇప్పటి వరకూ 850 మందికి పైలెట్లుగా గ్రామీణ యువత, రైతులకు శిక్షణ ఇచ్చింది. వారికి సర్టిఫికెట్లు కూడా జారీ చేశారు. మరో వంద మంది పాలిటెక్నిక్ విద్యార్థులకు కూడా ఇక్కడ శిక్షణ ఇచ్చారు. ఇప్పటికే ప్రధాన పంటలైన వరి, చెరకు, మినుము, పెసర, పత్తి, మిరప, జొన్న, మొక్కజొన్న, శనగ, వేరుశనగ లాంటి పంటల్లో డ్రోన్‌లతో సస్యరక్షణ చర్యలు చేపడుతున్నారు. యూనివర్సిటీలలో కృత్రిమ మేధపై దృష్టి పెట్టాలని వర్సిటీల సమావేశంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు నేపథ్యంలో పూర్తిస్థాయిలో కృత్రిమ మేధను వ్యవసాయ రంగంలోకి తీసుకు వచ్చేందుకు అంగ్రూ నడుం బిగించింది. ఇప్పటికే ఈ రంగంలో కొంతమేర ప్రయోగాలు మొదలు పెట్టింది. నూతన సంప్రదాయ వ్యవసాయ పద్ధతుల మధ్య సులువుగా, ఖర్చు తగ్గించేలా వ్యవసాయ రంగంలో విప్లవాత్మక పెనుమార్పులు తీసుకురావడానికి కృషి చేసింది. 2020 నుంచి విస్తృత పరిశోధనలు జరిపి దేశంలోనే అత్యాధునికమైన ఏరియల్ రోబోటైన్ డ్రోన్లను తీసుకువచ్చింది. ప్రస్తుతం రాష్ట్రంలో నాలుగు లక్షల ఎకరాల్లో ఈ డ్రోన్ల వినియోగిస్తున్నారు. అటు దేశానికి దిశా నిర్దేశం చేస్తూ కచ్చిత వ్యవసాయం వైపు రైతులను నడిపిస్తోంది. తాజాగా బుడమేరు వరదల్లో కూడా అంగ్రూ వ్యవసాయ డ్రోన్లను మార్చి ఉపయోగించారు.



కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అనుచరుడు, రౌడీషీటర్ రాగి నవీన్ చేతిలో గాయపడిన సహానా మంగళవారం రాత్రి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మూడు రోజుల కిందట నవీన్ తన పుట్టిన రోజు అని చెప్పి సహానాను తీసుకువెళ్లి ఆమెపై దాడి చేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సహానా ఆరోగ్యం క్షీణించడంతో మంగళవారం రాత్రి మృతి చెందింది. అంతకు ముందు వైఎస్సార్‌సీపీ గుంటూరు, నరసరావుపేట పార్లమెంటు నియోజకవర్గాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి పెద్దాసుపత్రికి వెళ్లి సహానా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఆయన వెంట పార్టీ నగర అధ్యక్షుడు వనమా బాలవజ్రబాబు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త నూరిఫాతిమా తదితరులు ఉన్నారు. ఆ తరువాత సహానా మృతి చెందినట్టు తెలియడంతో మాజీ మంత్రులు మేరుగ నాగార్జున, విడదల రజని, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మేయర్ కావటి మనోహర్ నాయుడు తదితరులు ఆసుపత్రికి చేరుకుని ప్రభుత్వ వైఖరిపై ధ్వజమెత్తారు.. ఇది ప్రభుత్వ హత్యేనని తేల్చి చెప్పారు. యువతి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

- గుంటూరు మెడికల్



## న్యూస్‌రీల్

### బాధితులకు ఆర్థిక సాయం అందజేత



నరసరావుపేట: గత ఎన్నికలలో తెలుగుదేశం, జనసేన వర్గీయుల దాడిలో గాయపడ్డ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో ఆ రెండు పార్టీల దౌర్జన్యాలకు గురైన మాబు సుభాని, బాషాలకు పార్టీ తరఫున అందజేసిన చెక్కులను పంపిణీ చేశారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీరికి సహాయం చేశారన్నారు. గతంలో కూడా కొంగితాల రామయ్య, కోప్పనబోయిన శ్రీనివాసరావులకు కూడా ఆర్థిక సహాయం చేయడం జరిగిందన్నారు. పమిడిపాడు గ్రామంలో ఇప్పటివరకు గాయపడిన పార్టీ కార్యకర్తలకు రూ.2.5లక్షలు సహాయం అందజేయటం జరిగిందన్నారు. భవిష్యత్తులోనూ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని, అందరం కలిసి పార్టీని బలోపేతం చేసి మళ్లీ అధికారంలోకి తీసుకువద్దామని చెప్పారు.

### పునీత అంతోనివారి జీవితం ఆదర్శనీయం

ఫాదర్ బాలస్వామిరెడ్డి



రెంటచింతల: కథోలికులందరూ సుగుణశీలి అయిన పునీత అంతోనివారి జీవితం ఆదర్శంగా తీసుకోవాలని మేడికొండూరు విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ గంటి బాలస్వామిరెడ్డి అన్నారు. స్థానిక అంతోనివారి కాలనీలోని అంతోనివారి మందిరంలో నిర్వహిస్తున్న 9 మంగళవారోత్సవాలలో భాగంగా తొలి మంగళవారం కానుకమాత చర్చి విచారణ గురువులు రె.ఫాదర్ వైల్ మర్రెడ్డి నేతృత్వంలో సమిష్టి దివ్య పూజాబలి నిర్వహించారు. ఆయన భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. నేటి యువత ఎంతో నీతివంతుడైన పునీత అంతోనివారి అడుగు జాడల్లో నడుస్తూ కుటుంబ బాధ్యతలను నిర్వర్తించాలన్నారు. ఏసుక్రీస్తు సూక్తులను అంతోనివారు ఆచరించి పునీతుడయ్యారని ఆయన అడుగుజాడలలో కథోలికులు నడిచి ఏసుక్రీస్తుకు నిజమైన భక్తులుగా సమాజంలో మెలగాలన్నారు. మందిరాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. కార్యక్రమంలో కానుకమాత చర్చి సహాయక గురువులు ఫాదర్ అగస్టీన్, కన్యాస్త్రీలు, మందిరం పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

### ఏఎన్‌యూకు రానున్న ఎన్ఐఆర్ఎఫ్ నిపుణుల బృందం



ఏఎన్‌యూ: ఎన్ఐఆర్ఎఫ్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్) నిపుణుల బృందం ఈ నెల 25, 26వ తేదీల్లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీని సందర్శించనుందని రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం తెలిపారు. ఆ రెండు రోజుల్లో యూనివర్సిటీలోని అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి ఏ విధమైన సెలవులు మంజూరు చేయబడవన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సెలవులు పెట్టుకోవాల్సిన వారు సంబంధిత అధికారుల నుంచి ముందుగా అనుమతి తీసుకోవాలని సూచించారు.

### పలు రైళ్లు రద్దు



లక్ష్మీపురం: సౌత్‌సెంట్రల్ రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో దానా తుపాన్ కారణంగా డివిజన్ మీదుగా పలు రైళ్లను రద్దు చేశారు. డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ మంగళవారం ఈ విషయం తెలిపారు. నెంబర్ 17016 సికింద్రాబాద్–భువనేశ్వర్ 23వ తేదీన, 12703 హౌరా–సికింద్రాబాద్, 18047 షాలిమార్–వాస్కో రైలు 24న, 12514 షాలిమార్–వాస్కో, 18464 బెంగళూరు–భువనేశ్వర్, 12704 సికింద్రాబాద్–హౌరా 23న, 03429 సికింద్రాబాద్–మాల్దా టౌన్ 24న, 12513 సికింద్రాబాద్–సాలీచర్ రైలు 26న, 17015 భువనేశ్వర్–సికింద్రాబాద్, 18463 భువనేశ్వర్–బెంగళూరు సిటీ రైలు 25వ తేదీన రద్దు అయ్యాయి.



మాట్లాడుతున్న రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

## రౌడీషీటర్ల కార్యకలాపాలను అణచివేయాలి

రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి

నగరంపాలెం: గుంటూరు రేంజ్ పరిధిలోని రౌడీషీటర్ల కార్యకలాపాలను పూర్తిగా అణచివేయాలని రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి అన్నారు. గుంటూరు కలెక్టర్ బంగ్లా రోడ్‌లోని రేంజ్ ఐజీ కార్యాలయంలో మంగళవారం జిల్లాల ఎస్పీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. లా అండ్ ఆర్డర్, తీవ్రమైన నేరాలకు సంబంధించి కేసులపై ఆరా తీశారు. రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠతిపాఠి మాట్లాడుతూ.. రౌడీషీటర్లపై నిరంతరం నిఘా ఉంచాలని అన్నారు. జిల్లాల్లోని అన్ని ముఖ్య ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వాటి పనితీరు నిత్యం సమీక్షించాలని చెప్పారు. కేసుల దర్యాప్తులలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని సూచించారు. కమ్యూనిటీ ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ద్వారా తప్పుడు ప్రచారాలు చేసే వారిని నియంత్రించాలని చెప్పారు. సైబర్ నేరాలు తగ్గించాలని సూచించారు. ఎస్పీలు సతీష్‌కుమార్ (గుంటూరు), శ్రీనివాసరావు (పల్నాడు), తుషార్‌డూడీ (బాపట్ల), దామోదర్ (ప్రకాశం), కృష్ణకాంత్ (ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా) పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి

అధికారులతో సమీక్షించిన కలెక్టర్, ఎస్పీలు



కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట: రహదారులపై ప్రమాదాల నియంత్రణ, మరణాలు సంభవించకుండా అవసరమైన లైటింగ్, స్పీడ్ బ్రేకర్లు, సైనేజ్ బోర్డులు, క్యాట్ ఐస్‌లు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో రహదారి భద్రత, మాదక ద్రవ్యాల నియంత్రణపై ఎస్పీ కంచి శ్రీనివాసరావుతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జంక్షన్లు, హైవే నుంచి సర్వీస్ రోడ్లు వద్ద స్పీడ్ బ్రేకర్లు, సైనేజ్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. మరణాల సంఖ్య తగ్గేలా సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించేలా అవగాహన కల్పించాలన్నారు. అధిక లోడ్, ఓవర్ స్పీడ్ నియంత్రించేలా రెవెన్యూ, పోలీస్, రవాణా శాఖాధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించాలన్నారు. నరసరావుపేట పట్టణంలో పార్కింగ్ స్థల ఏర్పాటుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. రహదారికి ఇరువైపులా ముందుకు వచ్చిన స్టాల్స్ యజమానులతో మాట్లాడి అడ్డులేకుండా చూడాలన్నారు. పశువుల యజమానులతో మాట్లాడి వాటి కొమ్ములపై రేడియం స్టిక్కర్లు అంటించేలా చర్యలు చేపట్టాలన్నారు. రహదారుల వెడల్పు, లైటింగ్, ఇతర పనులకు అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపాలన్నారు. ద్విచక్ర వాహనాలపై ట్రిపుల్ రైడింగ్ నివారించాలన్నారు. జిల్లాలో మాదక ద్రవ్యాల నిరోధానికి పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలోని మండలాలవారిగా యాక్సిడెంట్ల నివారణకు చేపట్టాల్సిన పనులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అదనపు ఎస్పీ జేవీ సంతోష్, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, రెవెన్యూ డివిజనల్ అధికారులు రమాకాంతరెడ్డి, మురళీకృష్ణ, మధులత పాల్గొన్నారు.

## మైనర్ బాలిక కిడ్నాప్

కేసు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు

నరసరావుపేటటౌన్: ప్రేమ పేరుతో బాలికకు మాయమాటలు చెప్పి బలవంతంగా కిడ్నాప్ చేసిన యువకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ విజయ్‌చరణ్ మంగళవారం తెలిపారు. పట్టణానికి చెందిన 16 ఏళ్ల బాలిక ఆర్కెస్ట్రాలో డ్యాన్సర్‌గా పనిచేస్తోంది. అక్కడ ఆమెకు వినుకొండ మన్నేపల్లి తండాకు చెందిన వెంకటేష్‌తో పరిచయం ఏర్పడింది. కొన్ని నెలలుగా ప్రేమ పేరుతో ఆమెను వేధిస్తున్నాడు. విషయం తెలుసుకున్న ఆమె కుటుంబ సభ్యులు యువకుడిని మందలించారు. సోమవారం బాలిక ఇంటికి వచ్చి బలవంతంగా ఆమెను వినుకొండకు తీసుకెళ్లాడు. ఈ మేరకు బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ ప్రారంభం

- నోడల్ అధికారిగా జలవనరుల శాఖ సత్తెనపల్లి ఈఈ నియామకం
- 40రోజుల్లో ప్రక్రియ ముగింపు
- వచ్చే నెల 21 నుంచి 29లోగా ఎన్నికలు, ప్రాజెక్ట్ ఛైర్మన్ ఎన్నిక



వినుకొండ రోడ్డులోని గోవిందపురం మైనర్‌కాలువ

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికల కోలాహలం మొదలైంది. సోమవారం షెడ్యూలు ప్రకటన విడుదలైంది. సాగర్ కుడి కాలువ కింద 2,868 ప్రాదేశిక నియోజకవర్గాలు(టీసీలు) ఉండగా వీరందరూ 274 నీటి వినియోగదారుల సంఘం (డబ్ల్యుఏ)లను ఎన్నుకుంటారు. వీరు 32 డిస్ట్రిబ్యూటరీ కమిటీలను ఎన్నుకొని ఒక్కొక్క డిస్ట్రిబ్యూటరీ కమిటీలకి ఒక ఛైర్మన్, వారందరూ కలిసి ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్‌ను ఎన్నుకుంటారు. ఈవిధంగా ఏర్పాటయ్యే సాగర్ ప్రాజెక్ట్ కమిటీ ఎన్నికలకు ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూలు మేరకు వచ్చే నవంబరు 29నాటికి ఎన్నికల ప్రక్రియను మొత్తం 40రోజుల్లో పూర్తి చేసేందుకు అధికారులు సమాయత్తమౌతున్నారు. వచ్చే నెల 21వ తేదీ నుంచి 29వ తేదీలోపు మొత్తం టీసీలు, డబ్ల్యుఏలకు ఎన్నికలు నిర్వహించి ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, కార్యవర్గం ఏర్పాటుచేస్తారు. మొత్తం జిల్లా కలెక్టర్ అజమాయిషీలో జరిగే ఈ ఎన్నికల ప్రకియకు నోడల్ అధికారిగా జలవనరులశాఖ సత్తెనపల్లి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మురళీధర్ వ్యవహరిస్తున్నారు. విడుదలైన షెడ్యూలు మేరకు ఓటర్ల జాబితా, ఎన్నికలు, ఎంపిక ప్రక్రియ పూర్తిచేయనున్నారు. ఓటర్ల జాబితాను రెవెన్యూశాఖ తయారు చేయనుంది. నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలోని మేజర్, మీడియం, మైనర్ కాలువల ఆయకట్టు రైతులలో సమర్థులైన వారిని ఛైర్మన్లుగా ఎన్నుకునే అవకాశం కలుగుతుంది. కాలువల కింద భూమి కల్గిన ప్రతి ఆయకట్టుదారుడు ఓటరుగా ఆరు నుంచి 12మంది ప్రాదేశిక నియోజకవర్గాలుగా(టీసీ) గుర్తిస్తారు. అర్హులైన వారు జలవనరులశాఖ వద్ద ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకోవాలి. వీరందరూ కలిసి నీటి వినియోగదారుల సంఘం (డబ్ల్యుఏ) ఎన్నుకుంటారు. నాగార్జునసాగర్ కుడికాలువ కింద లింగంగుంట్ల, ఒంగోలు సర్కిళ్లు ఉన్నాయి. రెండు సర్కిళ్లు కలిపి ఒక ప్రాజెక్ట్ కమిటీ ఉంటుంది. పల్నాడు జిల్లాలోని లింగంగుంట్ల సర్కిల్ పరిధిలోని వారే ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్‌గా ఎన్నికవుతారు. ఒంగోలు సర్కిల్‌లోని వారు ప్రాజెక్ట్ కమిటీ ఉపాధ్యక్షునిగా ఎన్నికవుతారు. గుంటూరు, పల్నాడు జిల్లాలో చిన్న నీటిపారుదల విభాగంలో 60డబ్ల్యుఏలు ఉన్నాయి. ఇవి మైనర్ ఇరిగేషన్ కింద ఉన్నందున డబ్ల్యుఏలు మాత్రమే ఉంటాయి. కేవలం రైతుల మధ్య జరగబోయే ఎన్నికలు గ్రామాల్లో వేడిని పుట్టించనున్నాయి. కమిటీలలో ఎంపిక అయ్యేందుకు రైతులు సమాయత్తమౌతున్నారు. 2019 నాటికి గతంలో ఏర్పడిన కమిటీకి కాలం తీరింది.

## యార్డుకు 30,429 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 30,429 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 28,133 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 16,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.18,600 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ.8,500 నుంచి రూ. 16,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,500 నుంచి రూ. 18,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 24,612 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.



## నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

- స్టడీ మెటీరియల్ సిద్ధం చేయండి
- జెడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



విద్యాశాఖాధికారులతో సమావేశమైన హెనీ క్రిస్టినా, సీఈవో జ్యోతిబసు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జెడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. మంగళవారం జెడ్పీ కార్యాలయంలోని ఛైర్‌పర్సన్ చాంబర్‌లో జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు అధ్యక్షతన గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల విద్యాశాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. క్రిస్టినా మాట్లాడుతూ సబ్జెక్టు నిపుణులతో రూపొందించిన ప్రత్యేక స్టడీ మెటీరియల్‌ను ముద్రించి రెండేళ్లుగా ఉచితంగా పంపిణీ చేస్తున్నామని చెప్పారు. వరుసగా మూడో ఏడాది స్టడీ మెటీరియల్ పంపిణీకి చర్యలు చేపడుతున్నామన్నారు. డిసెంబర్ 10లోపు విద్యార్థులకు అందించేలా ప్రణాళికలు రూపొందించా లని విద్యాశాఖాధికారులను ఆదేశించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో టెన్త్ చదువుతున్న 34,573 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఉందని ఆయా జిల్లాల డీఈవోలు ఛైర్‌పర్సన్, సీఈవో దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, డిప్యూటీ సీఈవో సీహెచ్ కృష్ణ అధికారులు పాల్గొన్నారు.

## ఓపెన్ స్కూల్ ప్రవేశాల గడువు పెంపు

డీఈఓ వెంకటేశ్వర్లు

నరసరావుపేటఈస్ట్: ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూలులో ప్రవేశం గడువును ఈనెల 31వ తేదీ వరకు పొడిగించినట్టు డీఈఓ ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ కె.ఎం.ఏ.హుస్సేన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రవేశాలు కోరే అభ్యర్థులు ఈనెల 25 వరకు అపరాధ రుసుం లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అపరాధ రుసుం రూ.200లతో ఈనెల 26 నుంచి 29 వరకు, అపరాధ రుసుం రూ.500లతో ఈనెల 30,31తేదీలలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తిరిగి గడువు పెంచటం జరగదని స్పష్టం చేశారు. అభ్యర్థులు వ్యక్తిగతంగా, ఏపీ ఆన్‌లైన్ కేంద్రాలు, గ్రామ వార్డు సచివాలయాలు ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు www.apopenrchoo.ap.gov.in వెబ్‌సైట్ లేదా అధ్యయన కేంద్రాలలో సంప్రదించాలన్నారు.

## క్లుప్తంగా

### పట్టభద్రుల ఓటు నమోదుకు ఏర్పాట్లు

**కారెంపూడి:** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు వేసేందుకు పట్టభద్రులు ఓటు నమోదు చేసుకునేందుకు యూటీఎఫ్ మండల శాఖ ఏర్పాట్లు చేసిందని ఫెడరేషన్ పల్నాడు జిల్లా కోశాధికారి జె వాల్యానాయక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీ ప్రొవిజినల్ కానీ, పట్టా కానీ, ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ జిరాక్స్‌లు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, సెల్ నంబర్ ఇస్తే ఓటు నమోదుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయిస్తామని పేర్కొన్నారు. నవంబరు 6వ తేదీలోపు దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుందని నాయక్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో అన్ని ఆన్‌లైన్ సెంటర్లలో ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని పాత ఓటర్ల లిస్టు ప్రస్తుతం పరిగణలో లేదని మళ్లీ అందరూ ఓటు నమోదు తప్పక చేసుకోవాలని పేర్కొన్నారు.

### రేపు సైక్లింగ్ జట్టు ఎంపిక పోటీలు

**జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సురేష్‌కుమార్**

**నరసరావుపేట ఈస్ట్:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా సైక్లింగ్ జట్టు ఎంపిక పోటీలను గురువారం నాదెండ్ల మండలం గణపవరం గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు స్కూల్ గేమ్స్ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్-14, అండర్-17 బాల,బాలికల జట్లు ఎంపిక చేస్తారని వివరించారు. ఎంపిక పోటీలకు వ్యాయామ ఉపాధ్యాయులు షేక్ ఇస్మాయిల్, ఎం.వి.సుబ్బారావు, పి.ఖాదర్‌మస్తాన్, సైక్లింగ్ కోచ్ కనకారావులు సెలక్షన్ కమిటీ సభ్యులుగా వ్యవహరిస్తారని తెలిపారు. క్రీడాకారులు ఉదయం 9గంటలకు హాజరు కావాలని సూచించారు.

### యువకుడు ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న అమర్‌నాథ్

**దాచేపల్లి:** మనస్థాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం జరిగింది. నగర పంచాయతీలోని ముత్యాలంపాడు రోడ్డులో నివాసం ఉంటున్న శివంగుల అమర్‌నాథ్(34) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు అవివాహితుడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ జి.పాపారావు తెలిపారు.

## కేంద్ర ప్రభుత్వ నిధులు సద్వినియోగపరుచుకోవాలి

- నేషనల్ మానిటరింగ్ టీం సభ్యులు శ్రీరాములురెడ్డి
- నాగవరం, గరికపాడు, 88 త్యాళ్లూరు సందర్శన


గ్రామసభలో మాట్లాడుతున్న ఎన్ఎల్ఎం టీం సభ్యులు శ్రీరాములురెడ్డి

**క్రోసూరు:** కేంద్ర ప్రభుత్వం ద్వారా వివిధ పథకాలకు వస్తున్న నిధులను అధికారులు సద్వినియోగపరుచుకోవాలని నేషనల్ మానిటరింగ్ టీం సభ్యులు శ్రీరాములురెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని నాగవరం, గరికపాడు, 88 త్యాళ్లూరు గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు జరుగుతున్న పలు పథకాలను పరిశీలించేందుకు ఆకస్మికంగా హాజరైన నేషనల్ మానిటరింగ్ టీం సభ్యులు గ్రామసభ ఏర్పాటు చేశారు. నోడల్ అధికారిగా డ్వామా పీడీ ఎం.సిద్ధమూర్తి హాజరై పర్యవేక్షించారు. ఆయా గ్రామాల్లో 15 ఆర్థిక సంఘం నిధులు, ఉపాధి హామీ పనులు, పెన్షన్లు ఏవిధంగా అందుతున్నాయి, సమస్యలు ఏమైనా ఉన్నాయా, ఎలాంటి సమస్యలు అనే విషయాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. డ్వాక్రా గ్రూపు మహిళలతో, జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలతో, ఆయా పంచాయతీల్లో నిర్వహిస్తున్న పనులను గురించి అడిగి తెలుసుకున్నారు. డ్వాక్రా మహిళలు తమకు తాము స్వయం సమృద్ధి చెందేందుకు రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. వాటిని సద్వినియోగ పరుచుకుంటున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు, పాడి రైతులకు, ఉద్యాన సాగుకు, కూలీలకు ఆర్థికంగా తోడ్పడుతుందన్నారు. వాటి గురించి ప్రజలు తెలుసుకుని సద్వినియోగపరుచుకొని అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి భాస్కరరెడ్డి, డీఆర్‌డీఏ ఏపీడీ బాలూనాయక్, ఎంపీడీవో బి.మహేష్ బాబు, పంచాయతీరాజ్ డీఈ వాణినాధ్, హౌసింగ్ డీఈ శ్రీనివాసరెడ్డి, ఏపీవో వెంకటేశ్వరరావు, ఏపీఎం కృపావేణి, పంచాయతీరాజ్ విస్తరణాధికారి జి.శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ వెంకట్రావు పాల్గొన్నారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు జలకళ


నిండుకుండను తలపిస్తున్న నాగార్జున సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్

**సత్రశాల(రెంటచింతల):** మండలంలోని సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు మూడు క్రస్ట్‌గేట్లు, రెండు యూనిట్ ద్వారా దిగువనున్న పులిచింతల ప్రాజెక్టుకు 55,634 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు ఏఈ జయపాల్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎగువనున్న నాగార్జున సాగర్ ప్రాజెక్టు నుంచి 45,322 క్యూసెక్కులు వరద నీరు స్థానిక టెయిల్‌పాండ్ ప్రాజెక్టు రిజర్వాయర్‌కు వస్తున్నట్లు తెలిపారు. సత్రశాల టెయిల్‌పాండ్ 3 క్రస్ట్‌గేట్లు 1.5 మీటర్లు ఎత్తి 47,055 క్యూసెక్కులు, విద్యుత్ కేంద్రంలో రెండు యూనిట్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి అనంతరం 8,579 క్యూసెక్కులు మొత్తం 55,634 క్యూసెక్కుల వరద నీటిని దిగువ నున్న పులిచింతల ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఎగువ నుంచి వచ్చే వరదను బట్టి దిగువ నున్న కృష్ణాకు నీటి విడుదల చేస్తామని తెలిపారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 75.50 మీటర్లకుగాను ప్రస్తుతం 75.50 మీటర్లు(247.70 అడుగులు) నీరు చేరుకుందని, 7.080 టీఎంసీల సామర్థ్యం ఉన్న ప్రాజెక్టులో ప్రస్తుతం 7.080 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. ప్రాజెక్టు టీఆర్‌సీ లెవల్ 55.58 మీటర్లుగా ఉందన్నారు.

## 25న పిడుగురాళ్లలో జాబ్ మేళా

**పిడుగురాళ్ల:** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 25వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఇ.తమ్మాజీరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పన కార్యాలయం, సీడాప్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురజాల నియోజకవర్గంలోని యువతి, యువకులు జాబ్‌మేళాలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్‌మేళాలో ఐసీఐసీఐ బ్యాంక్, అమర రాజా, కేఎల్ టెక్నికల్ సర్వీస్ వంటి పలు కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. జాబ్ మేళాకు పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ, బీటెక్, డిప్లమా, ఫార్మసీ విభాగాల చదువుకున్న 18 నుంచి 35 ఏళ్ల లోపు నిరుద్యోగ యువతి, యువకులు వారి బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. ఇంటర్వ్యూ ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 9492158153, 7842747682 నెంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

## ఏసీఏ అండర్-19 రాష్ట్ర జట్టు ఎంపిక మ్యాచ్‌లు ప్రారంభం

**తొలి మ్యాచ్‌లో గ్రూప్-బి జట్టు ఆధిక్యత**

**నరసరావుపేట ఈస్ట్:** ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కెఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో మంగళవారం నుంచి ఏసీఏ అండర్-19 రాష్ట్ర జట్టు ఎంపిక మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి. తొలి మ్యాచ్‌లో గ్రూప్-ఏ, గ్రూప్-బి టీమ్‌లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న గ్రూప్-ఏ జట్టు తన తొలి ఇన్నింగ్స్‌ను 37.1 ఓవర్లలో 103 పరుగులకే ముగించింది. జట్టులోని చరణ్‌జిత్ 38 పరుగులు సాధించాడు. గ్రూప్-బి జట్టు బౌలర్ పి.డి.రచిత్ మూడు వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన గ్రూప్-బి జట్టు తొలిరోజు ఆటముగిసే సమయానికి తన తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు నష్టపోయి 150 పరుగులు చేసింది. జట్టులోని రేవంత్‌నాగకుమార్ 41 పరుగులు సాధించగా, గౌతమ్ కృష్ణ 24, రచిత్ 12 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. గ్రూప్-బి జట్టు 47 పరుగులు ఆధిక్యంలో ఉంది. బుధవారం రెండవరోజు ఆట కొనసాగనుంది. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

## బేస్‌బాల్ పోటీలకు సాతులూరు క్రీడాకారులు



**నాదెండ్ల:** సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు క్రీడాకారులు బేస్‌బాల్ పోటీలకు రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికయ్యారు. మండడం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన ఎంపిక పోటీల్లో అండర్-14 విభాగంలో 9వ తరగతి చదువుతున్న బోరుగడ్డ అనురాధ, 8వ తరగతి చదువుతున్న గురిగింజల ధనుష్, అండర్-17 విభాగంలో పూర్వ విద్యార్థి మద్దుకూరి లీలావెంకట బాలాజీ ఎంపికయ్యారు. త్వరలో తిరుపతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ముగ్గురు క్రీడాకారులు పాల్గొననున్నారు. హెచ్ఎం వి.వెంకటరావు, పీడీ కె అంజమ్మ, ఉపాధ్యాయులు క్రీడాకారులను అభినందించారు.

## పండ్ల తోటల సాగు లాభదాయకం


గంగిరెడ్డిపాలెంలో పండ్ల తోటను పరిశీలిస్తున్న అధికారులు

**మాచవరం:** పండ్ల తోటల సాగు లాభదాయకమని కేంద్ర బృందం సభ్యుడు లోహిత్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు పరిశీలించేందుకు కేంద్ర బృందం సభ్యులు బుధవారం పర్యటించారు. గంగిరెడ్డిపాలెం, శ్రీరుక్మిణీపురం గ్రామ సచివాయాలను పరిశీలించి, ఉపాధి హామీ కూలీలు, పింఛనుదారులతో మాట్లాడారు. అభివృద్ధి కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహక పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏపీడీ మల్లికార్జునరావు, హౌసింగ్ డీఈ శ్రీనివాస నాయక్, పీఆర్ ఏఈ నాగేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేష్, ఈఓపీఆర్‌డీ వెంగళరావు, ఏపీఓ వెంకటేశ్వర్లు నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

## పాలనలో నూతన శకానికి నాంది పలికిన శంకరన్

**ప్రొఫెసర్ జి.హరగోపాల్**


సమావేశంలో మాట్లాడుతున్న జి.హరగోపాల్

**బాపట్ల:** ప్రభుత్వ పాలనలో నూతన శకానికి నాంది పలికిన యుగకర్త ఎస్ఆర్ శంకరన్ అని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ మాజీ ఇన్‌చార్జి వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ జి. హరగోపాల్ అన్నారు. మంగళవారం ఎస్ఆర్ శంకరన్ జయంతి సందర్భంగా ప్రజాస్వామ్యం - సుపరిపాలన అంశంపై ఎస్ఆర్ శంకరన్ మెమోరియల్ బాపట్ల పౌర సమాఖ్య ఏర్పాటు చేసిన శంకరన్ స్మారక సెమినార్‌లో హరగోపాల్‌తో పాటు అనేకమంది రిటైర్డు ఐఏఎస్ అధికారులు ఎస్ఆర్ శంకరన్‌తో ఉన్న అనుభవాలను ఈ సందర్భంగా పాలుపంచుకున్నారు. హరిగోపాల్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ప్రజాస్వామ్యం పది కాలాల పాటు పరిఢవిల్లాలంటే శంకరన్ లాంటివాళ్లు సమాజానికి ఎంతో అవసరమన్నారు. సుపరిపాలనపై ఆయన చేసిన ఆలోచనత్మాక నిర్ణయాలు, వివరణాత్మక ఆశయాలు భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన పాత్ర పోషించాయని పేర్కొన్నారు. ఎన్నో కీలకమైన నిర్ణయాల్లో ఒక నిర్మాణాత్మకమైన సుపరిపాలనకు శ్రీకారం చుట్టిన శంకరన్ సివిల్స్‌లో ఒక గొప్ప శ్రీ మంతుడుగా పేద ప్రజలకు సేవలు అందించారన్నారు. రిటైర్డు ఐఏఎస్ అధికారులు నిమ్మగడ్డ రమేష్ కుమార్, ఎస్.చక్రవర్తి, ఎస్.రమేష్ కుమార్, ఆర్.సుబ్రహ్మణ్యం, చక్రపాణి, కె.విజయకుమార్, శరత్ బోస్, శంకరం మెమోరియల్ ట్రస్టీలు పీసీ సాయిబాబు, జి.వెంకటేశ్వర్లు, కరణం రవీంద్ర బాబు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యలో ప్రతి ఒక్కరూ రాణించాలి



**నగరంపాలెం:** పిల్లలకు విద్య, వైద్యం, ఇతరత్రా మౌలిక సదుపాయాలు కల్పనలో రాజీపడొద్దని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి అన్నారు. జిల్లాలో స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం నిర్వహిస్తున్న హోమ్స్‌ను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఏపీ హైకోర్టు ఆదేశాల మేరకు ఆయా సంస్థల్లో సోదాలు చేపట్టారు. స్వర్ణభారత్‌నగర్‌లోని దాక్షిణ్య స్పెషల్ స్కూల్ ఫర్ ఐడీ, కాకాని రోడ్‌లోని లీమా డెఫ్ అండ్ మెంటల్లీ హ్యాండీక్యాప్డ్ బాయ్స్ వెల్ఫేర్ సంస్థను, నగరంపాలెంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల వసతిగృహం, సోషల్ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్ -1, సోషల్ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్ -2, జడ్పీలోని బాలికా సదన్‌ను, పరివర్తనా భవన్, గోరంట్లలోని కారమల్ సేవ సదన్‌ను సందర్శించారు. అందులోని పిల్లలకు అందిస్తున్న సదుపాయాలపై ఆరా తీశారు. పిల్లలను జాగ్రత్తగా చూడాలని అన్నారు. నాణ్యతమైన భోజనాన్ని అందించాలని చెప్పారు. చదువులో ప్రతి విద్యార్థి ముందంజలో ఉండేలా పర్యవేక్షించాలని అన్నారు.

## ఆరోగ్యమిత్రల సమస్యలు పరిష్కరించాలి

**జిల్లా సమన్వయకర్తకు వినతిపత్రం అందించిన సిబ్బంది**


జిల్లా సమన్వయకర్త డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆరోగ్యమిత్రలు

**చీరాల రూరల్:** డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో చాలా ఏళ్లుగా పనిచేస్తున్నప్పటికి ఫీల్డ్ సిబ్బంది సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదని జిల్లా వైద్యమిత్ర అధ్యక్షుడు బడుగు రాజు పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వైద్య ఆరోగ్య మిత్ర సిబ్బంది మంగళవారం జిల్లా సమన్వయకర్త సీహెచ్ ప్రవీణ్‌కుమార్‌కు బాపట్లలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో వైద్యమిత్రలుగా టీం లీడర్లుగా, జిల్లా మేనేజర్లుగా, ఆఫీస్ అసోసియేట్‌లుగా 17 ఏళ్లుగా పనిచేస్తున్నప్పటికీ కనీస వేతనాలు అమలు జరగడంలేదన్నారు. ట్రస్టు అధికారుల నుంచి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖాధికారులకు, మంత్రులకు, ప్రభుత్వ పెద్దలకు విన్నవించుకున్నప్పటికీ సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. జరిగిపోయిన కాలంలో కొందరు సిబ్బంది ఉద్యోగ విరమణ చేశారని, మరి కొందరు ఉద్యోగ విరమణకు దగ్గరలో ఉన్నారన్నారు. తక్షణమే ఉన్న సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బందికి ప్రభుత్వం తమ స్పష్టమైన వైఖరిని తెలియజేయాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి 15 రోజుల గడువుతో ప్రభుత్వానికి ఏపీ వైద్యమిత్ర ఎంప్లాయీస్ యూనియన్ తరపున అల్టిమేటం లెటర్ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈసమయంలో దశల వారీగా సానుకూలమైన పద్ధతులలో వివిధ రకాలుగా నిరసనలు తెలియజేయనున్నట్లు చెప్పారు. వైద్య మిత్రలు అన్నంగి రెబకా, కాకాని రాంబాబు, బోయాజ్, ప్రభాకర్, రాజశేఖర్, అనిల్, ఫణి, విజయశేఖర్‌లు పాల్గొన్నారు.

## విద్యుత్‌షాక్‌తో వృద్ధుడు మృతి

**సూరేపల్లిలో విషాదఛాయలు**


మృతి చెందిన లింగయ్య

**బల్లికురవ:** డాబాపైకి ఎక్కగా ప్రమాదవశాత్తు విద్యుత్ సప్లయ్ వైరు తగిలి వృద్ధుడు అక్కడిక్కడే మృతి చెందాడు. ఈఘటన సోమవారం రాత్రి బల్లికురవ మండలంలోని ముక్తేశ్వరం పంచాయతీలోని సూరేపల్లి గ్రామంలో జరిగింది. సేకరించిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రావులపల్లి లింగయ్య (77) భోజనం చేశాక చుట్ట తాగే అలవాటు ఉంది. డాబా పైకి ఎక్కి అటుఇటు తిరుగుతూ చుట్ట తాగుతుండగా డాబా పక్కగా వెళ్తున్న విద్యుత్ సప్లయ్ వైరు తగలటంతో విద్యుదాఘాతానికి గురై గాయాలపాలయ్యాడు. భర్త ఎంతకీ కిందకి దిగి రాకపోవటంతో భార్య అంజమ్మ డాబా ఎక్కి చూడగా తలకు గాయమై విగతజీవిగా లింగయ్య పడిఉండటం చూసి బోరున విలపించింది. మంగళవారం భార్య అంజమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ జీవీ చౌదరి కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు కలరు. అందరితో కలివిడిగా ఉండే లింగయ్య మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## కారు ఢీకొని యువకుడు దుర్మరణం


మృతి చెందిన రాజశేఖర్

**మార్టూరు:** రోడ్డు దాటుతున్న యువకుడిని కారు ఢీకొట్టడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈప్రమాదం స్థానిక జాతీయ రహదారిపై జొన్నతాళి స్టేజీలో వద్ద మంగళవారం సాయంత్రం జరిగింది. సీఐ ఎం.శేషగిరిరావు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని వలపర్ల గ్రామానికి చెందిన అందే రాజశేఖర్ (35) పెయింటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రాజశేఖర్ మంగళవారం సాయంత్రం జొన్నతాళి స్టేజీలో రోడ్డుకు పడమర వైపున తన బైకు ఆపి తూర్పు వైపున నిలబడి ఉన్న తన తండ్రి ఆదినారాయణ వద్దకు వెళ్లటం కోసం రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో ఒంగోలు వైపు నుంచి మార్టూరు వైపు వేగంగా వెళ్తున్న ఓ కారు రాజశేఖర్‌ను బలంగా ఢీకొట్టింది. రాజశేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న హైవే అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకొని రాజశేఖర్‌ను పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. సీఐ మద్దినేని శేషగిరిరావు పర్యవేక్షణలో మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని, అందులోని వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. మృతుడి తండ్రి ఆదినారాయణ ఇచ్చిన ఫిర్యాదుపై సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## దీపావళి మందుగుండు సామగ్రి స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న బాణసంచా సామగ్రి

**చేబ్రోలు:** చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామ పరిధిలోని గరువుపాలెంలో దీపావళి మందు గుండు సామగ్రిని అక్రమంగా తయారు చేస్తున్న వ్యక్తిని మంగళవారం చేబ్రోలు పోలీసులు అరెస్ట్ చేశారు. వడ్లమూడి గరువుపాలెంలో నేల టపాసులు తయారు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందటంతో ఎస్ఐ వెంకటకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఇంట్లో ఇరువురు వ్యక్తులు టపాసులు తయారు చేస్తుండగా పోలీసులు రాకను గమనించి ఒక వ్యక్తి పారిపోయాడు. మరొకర్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శేకూరు గ్రామానికి చెందిన బూరగ సైదా, అతడి స్నేహితుడు నారాకోడూరు గ్రామానికి చెందిన ముప్పవరపు సంజయ్ సారథి కలిసి కొద్ది సంవత్సరాలుగా ఇలా చేస్తున్నారని తెలిసింది. గరువుపాలెం గ్రామంలోని ఒక ఇంటిని అద్దెకు తీసుకొని అందులో పేలుడు పదార్థాలు నిల్వ చేశారు. 10 రోజులుగా ఈ ఇంటిలో నేల టపాసులు తయారు చేస్తున్నారు. కొన్ని ప్యాకెట్ల నేల టపాకాయలు, ఉపయోగించే ముడి సరుకులను స్వాధీనం చేసుకున్నారు. సైదాపై కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.. సారథిని త్వరలోనే పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.

## ఎఫ్ఎల్ఎన్ శిక్షణతో నాణ్యమైన విద్య



**తాడికొండ:** విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ డి.లింగేశ్వరరెడ్డి అన్నారు. తుళ్లూరు మండలం పెదపరిమిలోని ముప్వా చిన బాపిరెడ్డి చారిటబుల్ ట్రస్టులో మంగళవారం గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాలకు చెందిన ఎస్‌జీటీలకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతులు ప్రారంభం అయ్యాయి. దీనికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శిక్షణ ద్వారా నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు బోధించి వారిలోని నైపుణ్యాలను వెలికితీయాలని సూచించారు. కార్యక్రమాన్ని జిల్లా డీఈవో పి. శైలజ సందర్శించారు. డీఆర్‌పీ, ఎస్‌జీటీలకు పలు సూచనలు అందజేశారు. ఎస్ఏఎల్‌టీ ప్రోగ్రాం డైరెక్టర్ సురేష్, ప్రధాన్ కంటెంటెంట్ లీలా పద్మ ఆకస్మికంగా సందర్శించారు. ఈ కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్కే సలీం బాషా, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నలుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

**రేపల్లె రూరల్:** పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన మండలంలోని సింగుపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ మల్లికార్జునరావు వివరాల మేరకు తమకు అందిన సమాచారంతో తమ సిబ్బంది పేకాట శిబిరంపై దాడులు నిర్వహించారన్నారు. దాడులలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.3100లను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. వీరిని కోర్టుకు హాజరుపరచనున్నట్లు తెలిపారు.


## విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపండి

- బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి
- పలు పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు


విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలిస్తున్న కమిషన్ సభ్యురాలు పద్మావతి

**చీరాల అర్బన్:** బడి ఈడు పిల్లలందరూ తప్పనిసరిగా బడిలో ఉండే విధంగా చర్యలు చేపడుతున్నట్లు బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. మంగళవారం చీరాలలోని పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. పట్టణంలోని ఎస్ఆర్‌పీఎం హైస్కూల్‌ను తనిఖీ చేశారు. పాఠశాలలో పిల్లల హాజరు పట్టిక పరిశీలించారు. అలానే తరగతి గదిలో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను ముందు వరుసలో కూర్చోబెట్టి వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అలాగే పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి మంచి మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. అనంతరం పేరాలలోని ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూల్‌ను పరిశీలించి మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన బియ్యం స్టాకు తక్కువగా ఉండడాన్ని గమనించి హెచ్ఎంను వివరణ కోరారు. ఈపురుపాలెం బైపాస్‌లోని కేజీబీవీని పరిశీలించారు. అక్కడ లైట్లు సక్రమంగా లేకపోవడంతో సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే వేయించాలని సూచించారు. ఉమ్మడి ప్రకాశం, బాపట్ల జిల్లాలో చైల్డ్ ప్రొటెక్షన్ ఫోర్స్ సమర్థవంతంగా పనిచేస్తుందన్నారు. చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీతో పాటు చైల్డ్ వెల్ఫేర్ కమిటీతో కలిసి బాలబాలికల అభ్యున్నతికి, రాబోయే తరాలకు మంచి భవిష్యత్‌ను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆమె వెంట తహసీల్దార్ గోపీకృష్ణ, ఎంఈఓ పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, హెచ్ఎంలు, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, సిబ్బంది ఉన్నారు.

## కేసును తప్పుదోవ పట్టిస్తే ఊరుకోం


దళిత సంఘాల నేతలు, వివిధ పార్టీల నాయకులు

**గుంటూరు మెడికల్:** రౌడీ షీటర్ దాడిలో తీవ్ర గాయాలపాలై గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సహానాను మంగళవారం జిల్లాకి చెందిన దళిత ఉద్యమ నేతలు, ఆయా పార్టీల నాయకులు పరామర్శించారు. సంఘటన గురించి బాధితురాలి తల్లిదండ్రుల ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం వెంటనే బాధితురాలికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, నిందితుడు నవీన్‌ను పూర్తిస్థాయిలో విచారించాలని డిమాండ్ చేశారు. నిందితుడికి సహాయం చేసిన వ్యక్తులను కూడా కేసులో చేర్చాలన్నారు. కేసు తప్పుదోవ పట్టకుండా చట్టపరమైన శిక్షలు పడేలా పోలీసు దర్యాప్తు చేయాలని కోరారు. కేసును తప్పుదోవ పట్టిస్తే ఊరుకోబోమని దళిత నేతలు హెచ్చరించారు. తప్పుతోవ పట్టిస్తున్న తెనాలి రెండో పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాషాను వెంటనే విధుల నుంచి తొలగించాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. పరామర్శించిన వారిలో మాల మహానాడు అధ్యక్షుడు అన్నవరపు కిషోర్, గుర్రం రామారావు, బొనిగల ప్రదీప్, మాల యువసేన అధ్యక్షుడు పొందుగల చైతన్య, వీసీకే రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్, బీఎస్పీకి చెందిన కారుమంచిలి సందీప్, బత్తుల అనిల్ , చిన్నం డేవిడ్ విలియమ్స్, నల్లపు నీలాంబరం కనకవల్లి, వినయ్, మంచాల జోసెఫ్ తదితరులు ఉన్నారు.